తర్వాత పక్కింట్లో కాపరముంటున్న చలమయ్యని పిలిచేను.

నే:- నిన్నరాత్రి పక్కింట్లో యింతగొడవ జరుగుతే మీకు తెలీలేదా?

చ:- తెలియకేంబాబూ. ముందర పెద్ద శబ్దమయిందండి. మెలుకువొచ్చి అదేంటోనని ఆలోచించే వేళకి ధర్మయ్యింట్లోంచి కేకలు వినబడ్డాయండి. బయిటకొచ్చి చూస్తే అంతా చీకటి. ధర్మయ్యింటివేపు పరుగులేసి 'సీతన్న బావా' అని పిలిచేనండి. జవాబు లేకపోతే మళ్ళీ యింట్లోకొచ్చి లాంతరు వెలిగించుకుని చేతికఱ్ఱ పుచ్చుకుని బయట కొస్తుంటే ధర్మయ్యింటిమెట్లు శేషయ్యెక్కుతున్నాడు. నే ధర్మయ్య యింటిదగ్గర కొచ్చేటప్పటికి శేషయ్య యింట్లోంచి బయిటకొచ్చి... ఖూనీ జరిగిందని చెప్పి నన్ను ఊళ్ళోకెళ్ళి మనుషుల్ని తీసుకు రమ్మని పంపించేడు.

నే:- రెండోసారి నువ్వు బయిట కొచ్చినప్పుడు ధర్మయ్య యింటి మెట్లెక్కుతూ శేషయ్య నీకు కనబడ్డాడు. మొదటిసారి బైట కొచ్చినప్పుడు నీ కెవరూ కనబడలేదు. ఔనా?

చ:- చిత్తం.

నే:- శేషయ్య నీకు కనబడేముందరకాని, తర్వాత నువ్వు మనుషుల్ని పోగేసు కొచ్చేలోగా కాని ధర్మయ్యింటి కెవరెళ్ళిందీ ఏం జరిగిందీ నీకు తెలీదూ?

చ:- చిత్తం.

నే:- శేషయ్య ఖూనీ జరిగిందని చెప్పినప్పుడు నువ్వు ధర్మయ్య యింట్లో కెళ్ళి చూడలేదుకదూ?

చ:- లేదండి.

"సింగారి ఎలాంటి మనిషి?" అని అడిగేడు మధు.

చ:- నాకు తెలీదండి.

మ:- చాలా మంచిమనిషని నిశ్చయంగా చెప్పలేనంటావు ?

చ:- నాకు తెలీదు బాబూ.

మ:- సరేకాని, నీకూ శేషయ్యకీ ఏమైనా చుట్టరికం వుందా ?

చ:- ఉందండి. శేషయ్య మా యావిడ మేనత్తకొడుకు.

మ:- తరచు మీ యింటి కొస్తూవుంటాడా ?

చ:- ఎందుకు రాడండీ! ధర్మయ్యింటి కొచ్చినప్పుడల్లా మా యింట్లో పలకరించి వెడుతూనే వుంటాడు.

చలమయ్య బయటి కెళ్ళిపోయాక "ఓ సారి చలమయ్యభార్యని కూడా రమ్మని కబురుపెట్టు" అన్నాడు మధు. "అంత మూడాలనివుంటే వెళ్ళి చూసిరా" అన్నాను. అంతలో కరణంగారు లోపలికి రాగానే తన కుర్చీ ఖాళీచేసి మధు బయటు కెళ్ళేడు.

నే:- ధర్మయ్య, సింగారి, సీతన్న—రంగూన్‌నుంచి వచ్చేరు కదా. వీళ్ళ పుట్టు-పూర్వోత్తరాలు మీ కేమైనా తెలుసా ?

క:- అవన్నీ ధర్మయ్యే యీ వూరు రాగానే అందరికీ చెప్పేడు. పదిహేను సంవత్సరాలక్రితం రంగూన్‌లో ధర్మయ్యకీ సీతన్నకీ స్నేహం కుదిరిందట. అప్పట్నించీ అన్నదమ్ముల్లాగ ఒకేచోట వుంటూ వచ్చేర్ట. ధర్మయ్యకంటే సీతన్న ఎక్కువడబ్బు సంపాదించేవాడట. దానా దీనా ఐదేళ్ళక్రితం సీతన్నదగ్గిర రెండు మూడువేల రూపాయలు రొక్కం వుండీదట. ఆరోజుల్లోనే ప్రమాదవశాత్తూ సీతన్న కాలు విరిగిందట. అది కుదిరేవరకూ సింగారితల్లిని సీతయ్యకి పరిచర్య చెయ్యటానికి ధర్మయ్య కుదిర్చేడుట. మధ్య మధ్య తల్లి రావడానికి వీలులేనప్పుడు సింగారే వచ్చి కట్టుకట్టి వంట చేసిపెట్టి వెళ్ళిపోయేదిట. తన కష్ట సుఖాలు చెప్పుకోవడంలో ఓ సారి సింగారి ధర్మయ్యతో తన తండ్రి

నే :— పోనీ ... ఈ వూళ్ళో సీతన్న దగ్గర పెద్ద మొత్తా లప్పు తీసుకున్నవాళ్ళెవరో చెప్పగలరా ?

క :— తను యిప్పుడుంటున్న యింటిమీద చలమయ్య పది హేను వందలు తీసుకుని నిరుడే తన కూతురు పెళ్ళి చేసేడండి. తర్వాత ఓ వెయ్యి రూపాయిలు ఈ యేడే శేషయ్య తీసుకున్నాడు. చవగ్గా తన పొలం సరిహద్దులోవే పొలం అమ్మకానికొస్తే ఏభయి సెంట్లు కొన్నాడు. ఈ యిద్దరూ అప్పు రెండు మూడేళ్ళలో తీర్చి వెయ్యగల సమర్థులే. మిగిలినవన్నీ వందా రెండు వందలూ బాపతు.

తర్వాత ధర్మయ్య శేషయ్యల అంతరంగిక స్నేహితుల్ని దర్యాప్తు చెయ్యగా మరికొన్ని విషయాలు బయట పడ్డాయి.

ధర్మయ్య శేషయ్యలకు రంగూన్‌లో కూడా స్నేహముండేదట. ధర్మయ్య రావడానికి రెండేళ్ళక్రితం శేషయ్య ఈ వూరొచ్చి భూమి కొనుక్కుని స్థిరపడ్డాడు. శేషయ్య రంగూన్‌లో వుండగా కొన్నాళ్ళు శేషయ్యను సింగారి తండ్రి సింగారినిచ్చి పెళ్ళి చేస్తానని చెప్పి డబ్బు గుంజేవాడుట. ఇక్కడికి వచ్చేసేముందరే సింగారి తండ్రి అలా మభ్యపెట్టి చాలా మందిని మోసం చేసేడని గ్రహించి వాణ్ణి నాలుగు తన్ని ఎవరికీ చెప్పకుండా యిక్కడికి తిరిగి వచ్చేసేడుట. ఇక్కడి కొచ్చేక ఈ వివరాలన్నీ ధర్మయ్యకి శేషయ్య చెప్పేడుట.

రాను రాను కేసు అగాధమయ్యేలా కనబడుతుంది. శేషయ్య, చలమయ్య, కనకయ్య శెట్టి— ఈ ముగ్గురికీ ఈ హత్యవల్ల లాభం కన బడుతోంది. ఈ హత్యలు చెయ్యటానికి చేయించడానికి ఈ ముగ్గురికీ అవకాశా లున్నాయి. శేషయ్య ఏంచేసేడో చూసింది చలమయ్య. చలమయ్య ఏం చేసేడో చూసింది శేషయ్య. ఈ యిద్దరూ బంధువులు. ఈ యిద్దరూ కూడబలుక్కుని ఈఘోరం చేసినా చేసివుండొచ్చు.

